

మానవ అక్రమ రవాణా చట్టరీత్యా నేరం : జడ్జి

కడప : మానవ అక్రమ రవాణా చట్టరీత్యా నేరమని సీనియర్ సివిల్ జడ్జి, డిఎల్ఎస్ఎ సెక్రటరీ ఎస్. కవిత అన్నారు. శుక్రవారం ఆజాద్ నగర్‌లోని ముక్తియార్ విద్యాసంస్థల్లో డిఎల్ఎస్ఎ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. సందర్భంగా జడ్జి మాట్లాడుతూ మానవ అక్రమ రవాణా నివారణ కోసం వన్ స్టాప్ క్రైసిస్ టీమ్ ఏర్పాటు చేశారన్నారు. టీంలో 13 మంది సభ్యులుగా ఎంపిక చేశామన్నారు. ఈ టీం జిల్లా వ్యాప్తంగా హ్యూమన్ ట్రాఫికింగ్ అండ్ బొండెడ్ లేబర్ పై పనిచేస్తుందని తెలిపారు. ఈ టీం జిల్లా వ్యాప్తంగా అవేర్నెస్ క్యాంపులు నిర్వహిస్తూ బాధితుల గుర్తించి, వారికి తగిన న్యాయ సలహాలు ఇస్తామన్నారు. హ్యూమన్ ట్రాఫికింగ్ అండ్ బొండెడ్ లేబర్ నిరోధించడమే టీం లక్ష్యమని చెప్పారు. కార్యక్రమంలో వన్ స్టాప్ క్రైసిస్ టీమ్ సభ్యులు చంద్రకాంతమ్మ, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ శ్రీనివాసులు, దిశా పోలీసులు మురళి మోహన్, లక్ష్మీదేవి, ప్రిన్సిపల్ మౌనిష, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

చెత్త పన్ను వసూలుకు వేళాయే

- ఇంటి పన్నుతో కలిసి చెత్తపన్ను?!
- ప్రభుత్వ నిర్ణయంపై విస్మయం
- నేటి నుంచి వసూలు షురూ

జిల్లాలో చెత్తపన్ను వసూళ్లకు వేళైంది. ప్రభుత్వం ఏడాది కిందట చెత్త పన్ను వసూలు చేయసంకల్పించింది. చెత్త పన్ను వసూలు జిఒను సిపిఎం వెలుగులోకి తెచ్చి ఆందోళన చేపట్టింది. చెత్తపన్ను వసూలు అంశం పెద్దఎత్తున చర్చనీయాంశంగా మారిన సంగతి తెలిసిందే. ప్రతిపక్షాలు పోరుబాట పట్టినా ప్రభుత్వం వెనక్కి తగ్గలేదు. చెత్త పన్ను వసూలును సులభతరం చేయాలనే ఉద్దేశంతో ఇంటి పన్నుతో కలిపి చెత్తపన్ను వసూళ్లను అనుసంధానం చేయడానికి కసరత్తు చేస్తోంది.

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లాలోని కడప కార్పొరేషన్ సహా మిగిలిన మున్సిపాలిటీల్లో చెత్త పన్ను వసూలుకు రంగం సిద్ధమైంది. ఏడాది కిందటి నుంచి కడప నగర పాలక సంస్థ, ప్రొద్దుటూరు మున్సిపాలిటీల్లో మాత్రమే వసూలు చేస్తున్న సంగతి తెలిసిందే. కడప, ప్రొద్దుటూరు మున్సిపాలిటీ అనుభవాల ఆధారంగా ఏప్రిల్ నుంచి కడప కార్పొరేషన్, ప్రొద్దుటూరు మున్సిపాలిటీలు సహా మైదుకూరు, జమ్మలమడుగు, పులివెందుల, బద్వేల్ మున్సిపాలిటీల్లో వసూలు చేయనున్నారు. కడప కార్పొరేషన్ సహా జిల్లాలోని మున్సిపల్ యంత్రాంగాలు కార్యాచరణను వేగవంతం చేసింది. క్లీన్ ఆంధ్ర ప్రదేశ్ (క్లాప్) పేరుతో ఇంటి పన్నుతో కలిపి చెత్త పన్ను వసూలు చేస్తుండడం విస్మయాన్ని కలిగిస్తోంది. కార్పొరేషన్ సర్వసభ్య సమావేశం (బడ్జెట్ ముందటి) సందర్భంగా వామపక్షాలు చెత్తపన్ను మినహాయించాలని ఆందోళన చేసినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. కార్పొరేషన్ సర్వసభ్య సమావేశంలో కమలాపురం ఎమ్మెల్యే, మేయర్, సహా పలువురు కార్పొరేటర్లు ఎన్నికల ముంగిట చెత్తపన్ను వసూలును వాయిదా వేయాలనే డిమాండ్ మేరకు తీర్మానం చేసి పంపించినప్పటికీ ఎటువంటి ప్రయోజనమూ లేకుండా పోయింది. స్లమ్ ఏరియాలో రూ.40, మిగిలిన ఏరియాలో రూ.90 చొప్పున వసూలు చేస్తున్నారు. పన్ను వసూలు నిమిత్తం సచివాలయ సిబ్బంది గుంపులుగా ఇళ్ల దగ్గరకు వెళ్లి వసూలు చేస్తుండడం పట్ల విమర్శలు వెల్లువెత్తినప్పటికీ తగ్గలేదు.

క్లీన్ ఆంధ్రప్రదేశ్ (క్లాప్) ప్రోగ్రామ్‌లో భాగంగా చెత్తసేకరణ వేగవంతమైంది. ప్రతి ఇంటి దగ్గర నుంచి తడి, పొడిచెత్తను వేర్వేరుగా సేకరించాల్సి ఉంది. ఇటువంటి చెత్త సేకరణ కాంట్రాక్టును ఓ ప్రయివేటు సంస్థకు కట్టబెట్టింది. ఆ సంస్థ కడప కార్పొరేషన్‌లో 100 ఆటోలను ఏర్పాటు చేసింది. 90 ఆటోలు మాత్రమే పన్ను వసూలు ప్రక్రియలో పాలు పంచుకుంటున్నాయి. ఒక్కో ఆటో నెలకు రూ.63 వేలు చొప్పున రూ.61 లక్షలు వసూలు చేయాలని లక్ష్యంతో ముందుకు సాగుతుండడం గమనార్హం.



రోజూ ఇళ్ల నుంచి తడి, పొడి చెత్తలను వేర్వేరుగా సేకరించడం అంతంత మాత్రంగా సాగుతోంది. చెత్త సేకరణ కార్మికులకు సక్రమంగా వేతనాలు ఇవ్వకపోవడం, వాహనాలు మొరాయించడం వంటి కారణాలతో చెత్త సేకరణ ప్రక్రియ సజావుగా సాగడం లేదనే విమర్శలు ఉన్నాయి. కార్పొరేషన్, మున్సిపాలిటీల శివారు ప్రాంతాల్లో రెండు, మూడురోజులకు ఒకసారి చెత్తను సేకరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. వేళాపాళా లేకుండా చెత్త సేకరిస్తుండడం చర్చనీయాంశంగా మారింది. నెలకు చెత్త పన్ను ద్వారా కార్పొరేషన్‌లో రూ.41 లక్షలు వసూలు అవుతోంది. పన్ను వసూలు చేసినా చేయకున్నా ప్రయివేటు సంస్థ మాత్రం కార్పొరేషన్, మున్సిపాలిటీలకు పన్ను చెల్లించాల్సి ఉంది. ప్రజల నుంచి పన్ను వసూలు సజావుగా సాగని నేపథ్యంలో సాధారణ నిధుల నుంచి చెల్లించాల్సి ఉన్నట్లు తెలుస్తోంది.

ఇంటి పన్నుతో కలిపి చెత్తపన్ను వసూలు చేయడానికి రంగం సిద్ధమైంది. సచివాలయ సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది ఇంటి పన్ను వసూలు కోసం ఒత్తిడి పెంచడం ఆందోళన కలిగిస్తోంది. ప్రస్తుతం చెత్త పన్ను వసూలు చేయడానికి సులభతర మార్గాన్ని అన్వేషించారు. చెత్త పన్ను కూడా ఇంటి పన్నుతో కలిపి వసూలు చేయాలని నిర్ణయించడం గమనార్హం. ఇంటి పన్నుతో కలిపి చెత్త పన్ను వసూలు చేయడానికి ఉద్దేశించి ఇళ్ల మ్యాపింగ్ చేసే ప్రక్రియను చేపట్టనున్నట్లు సమాచారం. ప్రభుత్వ ఆదేశాలు అందిన వెంటనే చకచకా మ్యాపింగ్ ప్రక్రియను చేపట్టనున్నట్లు తెలుస్తోంది.

మ్యాపింగ్ వివరాలు

మున్సిపాల్టీ	నివాసాలు	మ్యాపింగ్
కడప	1,04,177	96,263
ప్రొద్దుటూరు	40,900	31,600
బద్వేల్	17,962	15,234
మైదుకూరు	6,513	7,754
పులివెందుల	21,000	19,000

సిట్టింగ్ జడ్జితో విచారించాలి

రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్‌కు అఖిలపక్ష నాయకుల వినతి

ప్రజాశక్తి - కడప అర్బన్

పశుసంవర్ధక శాఖ, పాలీ క్లినిక్ డిడి అచ్చెన్న హ్యతకు సంబంధించి సిట్టింగ్ జడ్జితో విచారించాలని, హత్య వెనుక ఉన్నతాధికారుల, రాష్ట్ర స్థాయి అధికారుల హస్తమున్నట్లు అనుమానం ఉందని అఖిల పక్ష నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం వారు కడప స్టేట్‌గెస్ట్ హౌస్‌లో ఉన్న రాష్ట్ర ఎస్‌సి కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఐ, సిపిఎం జిల్లా కార్యదర్శులు జిల్లా కార్యదర్శి జి. చంద్ర, జి. చంద్రశేఖర్, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి హరి ప్రసాద్, ఆప్ నాయకులు డాక్టర్ శ్రీనివాసులు మీడియాతో మాట్లాడుతూ అచ్చెన్నను ఆరు నెలలుగా తన వద్ద విధులు నిర్వహిస్తున్న ఏడీలు డాక్టర్ శ్రీధర్ లింగారెడ్డి, డాక్టర్ సురేంద్రనాథ్ బెనర్జీ, సర్జన్ డాక్టర్ శుభాష్ చంద్రబోస్ వేధింపులకు గురిచేసేవారని చెప్పారు. దీనిపై మృతుడు స్వయంగా కలెక్టర్, ఎస్పికి ఫిర్యాదు చేశారని పేర్కొన్నారు. వీరిని సరెండర్ చేస్తూ తీసుకున్న నిర్ణయంపై పశు సంవర్ధక శాఖ రాష్ట్ర డైరెక్టర్ డాక్టర్ అమరేంద్ర కుమార్ తిరిగి వారిని యధాస్థానాల్లో కొనసాగించడం దారుణమని వాపోయారు. పోలీసు అధికారులతో కాకుండా సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో జిల్లా ఉద్యమానికి శ్రీకారం చుడ్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బాదుల్లా, మున్నయ్య, దస్తగిరి రెడ్డి పాల్గొన్నారు. **ఎస్‌సి కమిషన్‌ను కలిసిన ఎస్‌పి..** ఎస్‌సి కమిషన్ ఎస్‌పి అన్బురాజన్ శుక్రవారం స్టేట్ గెస్ట్ హౌస్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. పశుసంవర్ధక శాఖ డీడీ హత్య కేసుకు సంబంధించి వివరాలు చైర్మన్ అడిగి తెలుసుకున్నారు. హత్యతో ప్రమేయం ఉన్న వారి పై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పశు సంవర్ధక శాఖ లో ఉన్నత స్థాయిలో ఉండే అచ్చెన్నను అదే శాఖ లో ఉన్నవారు హత్య చేయడం దుర్మార్గపు చర్య అన్నారు.



కమిషన్ చైర్మన్‌తో మాట్లాడుతున్న అఖిలపక్ష నాయకులు

హత్యతో ప్రమేయం ఉన్న ఎంతటి వారినైనా వదిలే ప్రసక్తే లేదని చెప్పారు. అచ్చెన్న హత్య లో సంబంధిత శాఖ నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోందని పేర్కొన్నారు. అచ్చెన కుటుంబ సభ్యులను కర్నూల్‌లో కలిశానని తెలిపారు. కుటుంబ సభ్యులు చెప్పిన సమాచారాన్ని నోట్ చేసుకున్నామని పేర్కొన్నారు. హత్య కేసులో విచారణ నిష్పక్షపాతంగా ఉండాలని చెప్పారు. అవసరమైతే సిబిఐ విచారణకు సిఫార్సు చేస్తామని చెప్పారు. చైర్మన్ ను కలిసిన వారిలో ఎస్పితోపాటు దిశా డిఎస్‌పి వాసు దేవన్, డిఎస్‌పి శివారెడ్డి ఉన్నారు.

హత్య సంఘటన స్థలాన్ని పరిశీలించిన చైర్మన్

పశు సంవర్ధ శాఖ డిప్యూటీ డైరెక్టర్ అచ్చెన్న హత్య సంఘటన స్థలాన్ని ఎస్‌సి కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్ పరిశీలించారు. హత్య తీరును పోలీసులను అడిగి తెలుసుకున్నారు. **ఎస్‌సి భూములు కాపాడండి**

పోరుమామిళ్ల టౌన్ : మండలంలోని ఎస్‌సిలకు చెందిన భూములను కొందరు ఢిఫారాలు, పాస్‌పుస్తకాలు సృష్టించి కబ్జా చేస్తున్నారని, వారి భూములకు రక్షణ కల్పించాలని ఎస్‌సి చైర్మన్‌కు మానవహక్కుల ప్రధాన కార్యదర్శి ముత్యాల ప్రసాద్‌రావు వినతి పత్రం అందజేశారు.

సామాజిక స్పృహ కోసమే ప్రత్యేక శిబిరం

ప్రజాశక్తి - కడప

విద్యార్థుల్లో సామాజిక స్పృహను పెంపొందించేందుకు, సమాజంలోని సమస్యలు తెలుసుకునేందుకు ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేశామని ప్రభుత్వ పురుషుల కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి. రవీంద్రనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఏడురోజుల ముగింపు కార్యక్రమం ప్రోగ్రామ్ అధికారి సావిత్రి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సంద ర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ ఇలాంటి ప్రత్యేక కార్యక్రమాలు రాబోవు రోజుల్లో మరిన్ని నిర్వహించాలని సూచించారు. వైవీయూ ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టన్ వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ ప్రత్యేక శిబిరాల ద్వారా విద్యార్థుల్లో క్రమశిక్షణతోపాటు సమస్యలను గుర్తించడానికి వీలుంటుందన్నారు. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. **కడప అర్బన్ :** వైవీయూ పోస్ట్ గ్రాడ్యు యేషన్ కళాశాల జాతీయ సేవా పథకం 7 ,8 ఆధ్వర్యంలో శివాజీ నగర్, వేలూరుపాడులో నిర్వహించిన ప్రత్యేక శిబిరం శుక్రవారం ముగిసింది. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ వసు గోవర్ధన్ రెడ్డి, డాక్టర్ టి. చంద్రశేఖర్ ఆధ్వర్యంలో శిబిరాలు కొనసాగాయి. ముగింపు సందర్భంగా ప్రిన్సిపల్ కె . కృష్ణారెడ్డి, ఎన్ఎస్ఎస్ సమన్వ యకర్త డాక్టర్ వెంకట్రామిరెడ్డి గ్రామీణ ప్రాంతాల్లో సేవలందించిన వాలంటీర్లను అభినందించారు.

మీటర్ రీడర్‌ల సమస్యలు పరిష్కరించాలని వినతి

కడప అర్బన్ : యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు సురేంద్ర బాబు అధ్వర్యంలో జిల్లాలోని అన్ని డివిజన్లల మీటర్ రీడర్స్ తమ సమస్యలు పరిష్కరించాలని సూప రింటెండెంట్ ఇంజినీర్‌కి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. కడపలో ఎస్ ఇ అందుబాటులో లేక పోవడంతో సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ మధు కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్ర మంలో యూనియన్ నాయకులు ఓబులేసు పాల్గొన్నారు.

ఉత్సాహంగా బండలాగుడు పోటీలు

ప్రజాశక్తి-కలసపాడు

మండలంలోని మహానందిపల్లె గ్రామపంచాయతీలో ఆంజనేయస్వామి తిరుణాలను పురస్కరించుకుని బండలాగుడు పోటీలను బండ లాగుడు పోటీలు శుక్రవారం ఉత్సాహంగా నిర్వహించారు. ఇందులో ప్రథమ బహుమతి శీలం జగన్మోహన్ రెడ్డి, ద్వితీయ బహుమతి మర్రి రాజశేఖర్ రెడ్డి, తృతీయ బహుమతి బెస్తవారిపేట గ్రామానికి చెందిన వృషభములకు గెలుపొందాయి. కార్యక్రమంలో సర్పంచ్ డి. శ్రీనివాసరెడ్డి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

నగరంలో స్వచ్ఛత మార్షల్ ర్యాలీ

ప్రజాశక్తి - కడప అర్బన్

స్వచ్ఛభారత్‌లో భాగంగా నగరంలో స్వచ్ఛత మార్షల్ ర్యాలీ కార్పొరేటర్లు, నగరపాలక మహిళ సిబ్బంది శుక్రవారం నిర్వహించారు. కమిషనర్ సూర్య సాయి ప్రవీణ్ చంద్ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. మొదట ప్రతిజ్ఞలో భాగంగా 'నా ఇల్లు, నా వీధి, నా నగరం, నా కార్యాలయాన్ని శుభ్రంగా ఉంచుతానని, చెత్తరహిత నగరానికి మద్దతు ఇస్తానని, రోడ్లు, వీధులు, చుట్టు పక్కల చెత్తను, నగరంలో చెత్త లేకుండా ఉంచడానికి అవగాహన కల్పిస్తానని, తడి, పొడి చెత్త, గృహ ప్రమాదకర వ్యర్థాలను రోజూ వేరు చేసి మున్సిపాలిటీకి చెందిన స్వచ్ఛ ఆటో లకు అందజేస్తాం' అని ప్రతిజ్ఞ చేయించారు. ర్యాలీ కడప నగర పాలక సంస్థ నుంచి కోటిరెడ్డి సర్కిల్, అంబేద్కర్ సర్కిల్, మహావీర్ సర్కిల్ మీదుగా సంధ్యా సర్కిల్ అనంతరం నగరపాలక సంస్థ కార్యాలయం వద్దకు చేరుకుంది. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ చెత్త రహిత నగరంగా తీర్చిదిద్దడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. అందులో భాగంగా తడి చెత్త, పొడి చెత్త, గృహ ప్రమాదకర వ్యర్థాలను వేరుగా చేసి నగరపాలక సిబ్బందికి అందజేయాలని పేర్కొన్నారు.

మహిళ ఆచూకీ లభ్యం : సిఐ

ప్రజాశక్తి-ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

భర్తతో గొడవపడి గురువారం ఇంటి నుంచి తన ఆరుగురు పిల్లలతో వెళ్లిపోయిన మహిళ ఆచూకీ లభ్యమైందని టూటౌన్ సిఐ ఇబ్రహీం తెలిపారు. టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని మోడంపల్లెలో నివాసమున్న దొరసానిపల్లె వెంకట సుబ్బమ్మ తన భర్త శ్రీరాములుతో గొడవపడి 30న తన పిల్లలు ఆశ్రిత, అజయ్, అనుషా, కళ్యాణి, లావణ్య, బద్రి అను వారిని తీసుకొని, తన భర్తకు, ఇంటిలో ఎవరికీ చెప్పకుండా ఉదయం 10 గంటల సమయంలో ఇంటి నుంచి వెళ్లి పోయిందన్నారు. వెంకటసుబ్బమ్మ తల్లి నారాయణమ్మ పిర్యాదు మేరకు ప్రొద్దుటూరు రెండవ పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి, గాలించుటకు రెండు బృందాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మిస్సింగ్ అయిన వెంకట సుబ్బమ్మ తన పిల్లలను అహోబిలంలో ఆశ్రమం నందు ఉన్నారని సమాచారం తెలుసుకొని 24 గంటలలోపే గుర్తించి శుక్రవారం పోలీస్‌స్టేషన్‌కు తీసుకొని వచ్చి తన నారాయణమ్మకు అప్పగించామని తెలిపారు. ఈ కేసులో ప్రతిభ కనపరిచిన కానిస్టేబుళ్లు బాబాఫక్రుద్దీన్, రామాంజనేయులును సిఐ ఇబ్రహీం అభినందించారు.

కనులపండువగా ధ్వజారోహణం



ధ్వజారోహణ కార్యక్రమం నిర్వహిస్తున్న వేదపండితులు

ప్రారంభమైన కోదండరాముని బ్రహ్మోత్సవాలు

ప్రజాశక్తి - ఒంటిమిట్ట

ఒంటిమిట్టలోని పురాతన చారిత్ర కప్రాశస్త్యం గల శ్రీ కోదండరామస్వామివారి ఆలయంలో శుక్రవారం ఉదయం ధ్వజారోహణంతో శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 10 నుండి 10.20 గంటల వరకు వృషభలగ్నంలో పాంచరాత్ర ఆగమశాస్త్రబద్ధంగా గరుడపటాన్ని ప్రతిష్ఠించి శాస్త్రోక్తంగా ధ్వజారోహణ ఘట్టం నిర్వహించారు. కంకణబట్టర్ రాజేష్ కుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జెఇఒ వీరబ్రహ్మం మాట్లాడుతూ ధ్వజారోహణంతో వైభవంగా రాములవారి బ్రహ్మో త్సవాలు ప్రారంభమైనట్టు తెలిపారు. ఈ ఉత్స వాల్లో ప్రధానంగా ఏప్రిల్ 3న హనుమంత వాహనం, 5న కల్యాణోత్సవం, 6న రథోత్సవం, 8న చక్రస్నానం జరుగుతాయన్నారు. కల్యాణం రోజున ప్రభుత్వం తరఫున ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పట్టువస్త్రాలు సమర్పి స్తారని తెలిపారు. జిల్లా యంత్రాంగంతో సమ న్వయం చేసుకొని ముఖ్యమంత్రి పర్యటనకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కల్యాణానికి విశేషంగా విచ్చేసే భక్తులకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు చేపడతామన్నారు. కంకణబట్టర్ రాజేష్ కుమార్ మాట్లాడుతూ ముందుగా గరుడ ధ్వజ పటాన్ని ఊరేగింపుగా తీసుకొచ్చి గరుడ ప్రతిష్ఠ, ప్రాణప్రతిష్ఠ, నేత్రోన్మీలనం నిర్వహించామన్నారు. ధ్వజ స్తం భానికి నవకలశ పంచామృతాభిషేకం చేసినట్టు చెప్పారు. రాగతాళ నివేదన ద్వారా ఇంద్రాది సకల దేవతలను, నవగ్ర హాలను, అష్టది క్పాలకులను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించినట్టు తెలిపారు. ఈ సందర్భంగా వేదపండితులు చతుర్వేద పారా యణం చేశారు. కార్యక్రమంలో రాజంపేట ఎమ్మె ల్యే మేడా మల్లికార్జునరెడ్డి, జాయింట్ కలెక్టర్ సాయికాంత్‌వర్మ, శిక్షణ కలెక్టర్ రాహుల్ మీనా, ఆలయ డెప్యూటీ ఇఒ నటేష్ బాబు, సూపరిం టెండెంట్లు పి.వెంకటేశయ్య, ఆర్పీ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

శేషవాహనంపై దర్శనమిచ్చిన కోదండరాముడు

శ్రీకోదండరామస్వామివారి బ్రహ్మోత్సవాల్లో మొదటి రోజైన శుక్రవారం రాత్రి శేషవాహనంపై సీతాలక్ష్మణ సమేత శ్రీరాముల వారు. భక్తులను కటాక్షించారు. రాత్రి 7 నుండి 9 గంటల వరకు వాహనసేవ నిర్వ హించారు. ఆలయ మాడ వీధుల్లో కేరళ వాయిద్యాలు, భక్తజన బృందాలు చెక్క భజనలు, కోలా టాలతో స్వామి వారిని కీర్తి స్తుండగా మంగళ వాయిద్యాల నడుమ స్వామివారి ఊరేగింపు కోలాహలంగా జరిగింది. భక్తులు అడుగడగునా కర్పూరహారతులు సమర్పించి స్వామివారిని దర్శించుకున్నారు.



శేషవాహనంపై ఊరేగుతున్న కోదండరాముడు

కల్యాణోత్సవం ఏర్పాట్లను పరిశీలించిన జెఇఒ

ఒంటిమిట్ట శ్రీ కోదండ రామస్వామి బ్రహోత్సవాల్లో భాగంగా ఏప్రిల్ 5న జరగనున్న శ్రీ సీతారాముల కల్యాణోత్సవం సంద ర్భంగా భక్తుల కోసం చేయాల్సిన ఏర్పాట్లను టిటిడి జెఇఒ వీరబ్రహ్మం, వైఎస్సార్ జిల్లా జాయిం ట్ కలెక్టర్ సాయికాంత్ వర్మ శుక్రవారం పరిశీ లించారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహ న్‌రెడ్డి కల్యాణో త్సవం రోజున పట్టువస్త్రాల సమర్ప ణకు వచ్చిన పుడు ఆల యంలో చేపట్టాల్సిన ఏర్పాట్లపై అధికా రులతో జెఇఒ చర్చించారు. కల్యాణ వేదిక వద్ద జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. గ్యాలరీల్లో భక్తులకు కల్పించాల్సిన వసతులపై జిల్లా అధికారులతో చర్చించారు. జెసి సాయికాంత్ వర్మ మాట్లాడుతూ జిల్లా నుంచి డెప్యుటేషన్ మీద నియమించిన సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం ఆలయం వద్దగల పరిపాలన భవనంలో జెఇఒ వివిధ విభా గాల అధికారులతో సమీక్ష నిర్వహించారు. కార్యక్ర మంలో డిఎఫ్ఒ శ్రీనివాస్, ఎస్ఇ(ఎలక్ట్రికల్స్) వెంకటేశ్వర్లు, డిఇ చంద్రశేఖర్, ఇఇ సుమతి, డెప్యూ టీ ఇఒలు గుణభూషణ్‌రెడ్డి, నటేష్ బాబు, శివప్ర సాద్, సుబ్రహ్మణ్యం, అదనపు ఆరోగ్యాధికారి డాక్టర్ సునీల్ కుమార్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

ప్రజలపై భారాలు తక్షణమే ఆపాలి : సిపిఎం

ప్రజాశక్తి - కడప అర్బన్

కేంద్ర ప్రభుత్వం ఏప్రిల్ 1 నుంచి ప్రజానీకం మీద మోపుతున్న అన్ని రకాల భారాలను తక్షణమే ఆపాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని సిపిఎం నగర కార్యదర్శి రామమోహన్ హెచ్చరించారు. శుక్రవారం పాత బస్టాండ్ వద్దనున్న పూలే సెంటర్‌లో ప్రజలపై భారాలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సిపిఎం నగర కమిటీ అధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం సామాన్య ప్రజానీకంపై పెద్దఎత్తున భారాలు మోపుతూ అదాని, అంబానీకి సంపదను కట్టబెట్టే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ప్రజానీకం ఆరోగ్యం కాపాడుకోవడం కోసం ఉపయోగించే ఔషధ ధరలను గతంలో ఎన్నడూ లేని విధంగా 12 శాతం పెంచుతోందన్నారని తెలిపారు. బిపి, షుగర్, థైరాయిడ్, డయాలసిస్, గుండె సంబంధిత 800 రకాల మందులు జాతీయ ఔషధ ధరల అథారిటీ పెంచేలా చర్యలు తీసుకుందన్నారు. జిల్లాలో ఉన్న ప్రతి కుటుంబంలో టాబ్లెట్ల వినియోగం పెరగడం వల్ల సామాన్య, మధ్యతరగతి ప్రజానీకం మీద అత్యధిక భారం పడుతుందన్నారు. టోల్ ఛార్జీలను 5 శాతం పెంపు, సిమెంట్ ధరల పెరుగుదల వల్ల కొలుకొలేని దెబ్బ ప్రజలకు తగులుతుందని చెప్పారు.



నిరసన వ్యక్తం చేస్తున్న సిపిఎం నాయకులు

అన్ని రకాల భారాలను తక్షణమే ఆపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు దస్తగిరిరెడ్డి, అన్వేష్, నగర నాయకులు ఓబులేసు, పరుక్ హుస్సేన్, జమీల, మహబూబ్ తార, షకీలా, షంషాద్, రాజమణి, సరిత, లోక్‌సత్తా నాయకులు దేవర కృష్ణ, సిపిఎం నాయకులు వెంకట సుబ్బయ్య, ఓబులయ్య, వినోద్, శివ, రియాజ్ పాల్గొన్నారు.



సంబరాలు చేసుకుంటున్న రిమ్స్ వైద్యులు, ప్రిన్సిపల్

పీజీ సీట్ల పెంపుపై హర్షం

ప్రజాశక్తి-కడప సిటీ

రిమ్స్ కళాశాలలో పీజీ సీట్ల పెంపుపై మానసిక, పైథాలజీ విభాగంలోని వైద్యులు, సిబ్బంది హర్షం వ్యక్త చేశారు. శుక్రవారం వారు ప్రిన్సిపల్ డాక్టర్ సురేఖను అభినందనలు తెలియజేస్తూ కేట్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్ఎంసి తనిఖీలో మానసిక విభాగానికి 5, పైథాలజీ విభాగానికి 9 పీజీ సీట్లు అడ్మిషన్లు పొందడానికి అనుమతి లభించడం సంతోషకరమన్నారు. పీజీ సీట్లు పెంపునకు సహకరించిన అందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్, అకడమిక్ డాక్టర్ లక్ష్మీ బాయి, మానసిక విభాగాదిపతి డాక్టర్ లక్ష్మీ ప్రసన్న, అసోసియేట్ ప్రొఫెస్సర్ డాక్టర్ వెంకట్రాముడు, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ యతిరాజు, పైథాలజీ విభాగం విభాగాధిపతి డాక్టర్ వరలక్ష్మి, డాక్టర్ శోభారాణి పాల్గొన్నారు.

రైల్వే హమాలీలకు ఉచిత వైద్య శిబిరం

కడప : శుక్రవారం కడప రైల్వే గూడ్స్ షెడ్ ఆవరణలో కార్మికులు, హమాలీలకు ఇంపాక్ట్ గురు ఫౌండేషన్, కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ కంపెనీల సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరాన్ని నెల్లూరు జోనల్ మేనేజర్ ఎల్‌జెఎస్ మాధవన్, రైల్వే స్టేషన్ మేనేజర్ డి.ఎన్.రెడ్డి ప్రారంభించారు. రిమ్స్ వైద్యశాల డాక్టర్లు దాదాపు 130 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కోరమాండల్ నెల్లూరు జోనల్ మేనేజర్ మాట్లాడుతూ ఇటువంటి వైద్య శిబిరాలు ఎపి, తెలంగాణాలోని ప్రతి జిల్లాలోని రైల్వే హమాలీలకు నిర్వహించామని తెలిపారు. అనంతరం హమాలీలకు కొరమండల్ కంపెనీ టీ షర్టులు అందజేశారు. కార్యక్రమంలో అగ్రామనిస్టు నర్సిరెడ్డి, వేర్ హౌసింగ్ ఆఫీసర్ జిఎస్ సతీష్, కోరమాండల్ కాంట్రాక్టర్ నగేష్, డాక్టర్లు సాగర్ రెడ్డి, నందారెడ్డి, క్యాంప్ కో ఆర్డినేటర్ విష్ణువర్ధన్ పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న దేవులపల్లి అమర్

జర్నలిస్టులకు ఆదర్శం శ్రీనాథ్‌రెడ్డి

- జాతీయ మీడియా సలహాదారు దేవులపల్లి అమర్

ప్రజాశక్తి - కడప అర్బన్

రాయలసీమలో కరువు కాటకాలను పారదోలేందుకు చేపట్టిన ఉద్యమాన్ని నడిపించడంలో ప్రెస్ అకాడమీ మాజీ చైర్మన్ శ్రీనాథ్‌రెడ్డి కీలక పాత్ర పోషించి, జర్నలిజం వృత్తికే వన్నెతెచ్చారని, ఆయన ప్రస్తుత జర్నలిస్టులకు ఆదర్శంగా నిలిచారని జాతీయ మీడియా సలహాదారు దేవులపల్లి అమర్ పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సీనియర్ జర్నలిస్టు వై. నాగిరెడ్డి అధ్యక్షతన సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీమ నీటి అవసరాలు, ఏడారి పరిస్థితుల గురించి సామాన్యులకు సైతం అర్థమయ్యే రీతిలో కథనాలు రాశారని చెప్పారు. మీడియా రంగంలో తనదైన ముద్ర వేసుకున్నారని కొనియాడారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. కార్యక్రమంలో మాజీ హోమ్ శాఖ మంత్రి ఎం.వి. మైసూరారెడ్డి, జడ్‌పి చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి సీనియర్ ఎడిటర్ కె. రామచంద్రమూర్తి, రాయలసీమ కార్మిక, కర్షక సమితి అధ్యక్షులు, సిపిఐ, సిపిఎం నాయకులు జి.చంద్ర, జి.చంద్రశేఖర్, జర్నలిస్టులు పాల్గొన్నారు.

ఒక్క క్లిక్‌తో వైవీయూ ఆర్అండ్‌డి సమాచారం

ప్రజాశక్తి - కడప అర్బన్

ఒక్క క్లిక్‌తో వైవీయూ ఆర్అండ్‌డి సమాచారం అందుబాటులోకి వస్తుందని విసి జింక రంగ జనార్ధన్, రిజిస్ట్రార్ పి. వెంకటసుబ్బయ్య, ప్రిన్సిపల్ కృష్ణారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం అందుకు సంబంధించిన వెబ్‌సైట్‌ను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ ఆర్అండ్‌డి కి సంబంధించి ప్రాజెక్టు ప్రపోజల్, డిఎస్‌టి, సిఎస్ఆర్ఐఆర్ అడ్వర్‌టైజ్‌మెంట్లు, ప్రాజెక్టులు, స్కాలర్లకు ఉన్న పరిశోధన అవకాశాలు ప్రాజెక్టులో లభిస్తాయని చెప్పారు. కార్యక్రమంలో వైవీయూ పాలకమండలి సభ్యురాలు ఆచార్యపుత్తా పద్మ, ఆర్అండ్‌డి డైరెక్టర్ ఆచార్య పి. చంద్రఓబుల రెడ్డి, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త ఎన్.వెంకట్రామిరెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పుట్టా సుధాకర్‌యాదవ్

ఎమ్మెల్సీ ఫలితాలే ప్రజావ్యతిరేకతకు నిదర్శనం

ప్రజాశక్తి -ఖాజీపేట

వైసిపి ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేకత పెద్దత వ్యక్తమవుతోందని, ఇందుకు ఇటీవల నిర్వహించిన ఎమ్మెల్సీ ఎన్నిక ఫలితాల్లో టిడిపి ఘన విజయం సాధించడమే నిదర్శనమని మైదుకూరు నియోజకవర్గ టిడిపి బాధ్యులు పుట్టాసుధాకర్‌యాదవ్ పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని పత్తూరు పంచాయతీలో టిడిపి నాయకులు జానకిరామ్‌కు చెందిన రైస్ మిల్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి పొట్లదుర్తి సురేష్‌నాయుడుతో కలసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సుధాకర్‌యాదవ్ మాట్లాడుతూ టిడిపి కార్యకర్తలు నాయకులు, అభిమానులు మరింత ఉత్సాహంతో పని చేస్తే రానున్న సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ ఘనవిజయం సాధించడం తధ్యమని, ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు అవుతారని ధీమా వ్యక్తం చేశారు. కార్యకర్తలు నాయకులు ఐకమత్యంతో ముందుకెళ్తే విజయం సాధించడం పెద్ద కష్టమేమీ కాదని తెలిపారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు తిప్పిరెడ్డి లక్ష్మిరెడ్డి, సీనియర్ నాయకులు సందుల నాగశివారెడ్డి, తుట్టె రాము యాదవ్, కొత్తూరు ఉప సర్పంచ్ ముత్తూరు రమణ బాలకొండా రెడ్డి, రామానాయుడు, పుల్లయ్య నాయుడు, కొంగాని వెంకటసుబ్బయ్య యాదవ్ పాల్గొన్నారు.

నూతన రేలింగ్ షెడ్ ప్రారంభోత్సవం

ఖాజీపేట : మండల పరిధిలోని చెన్నముక్కపల్లిలో దేవదాసు ఏర్పాటు నుతన రేరింగ్ షెడ్డు ప్రారంభోత్సవం శుక్రవారం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా జిల్లా అగ్రికల్చర్ జాయింట్ డైరెక్టర్ నాగేశ్వర రావు, కడప డిఎస్ఒ శ్రీనివాసరెడ్డి, వ్యవసాయ సహాయ సంచాలకులు సుబ్బారావు హాజరై ప్రారంభించారు. కార్యక్రమంలో ఎస్ఒ దీక్షిత్, ఎఎస్ఒ సూర్యుడు, నాగేశ్వరరెడ్డి, పట్టు పరిశ్రమ సిబ్బంది రాజు, గుర్రప్ప, సరోజినీ దేవి, కల్యాణి పాల్గొన్నారు.



ర్యాలీ ప్రారంభిస్తున్న కమిషనర్

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి

ఎర్రగుంట్ల : ప్రజలు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ పగడాల జగన్నాథ్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక నగర పంచయాతీ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం నుంచి నాలుగు రోడ్ల కూడలి వరకు స్వచ్ఛత ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమాన్ని కమిషనర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తడి, పొడి, హానికర చెత్తలను వేరు చేసి మున్సిపల్ వాహనాలకు అందంచాలన్నారు. పరిసరాలు శుభ్రంగా ఉంచుకుని ఆర్యోగంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్విరాన్మెంట్ ఇంజినీర్ సందీప్, టిపిఎస్ ఇందిర, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మధు కుమార్, మెప్మా సిఇఒలు విమల, వసంత్, ఎస్‌హెచ్‌జి మహిళలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పులివెందుల రూరల్: ప్రతి ఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని పులివెందులను పరిశుభ్రతలో నెంబర్‌వన్‌గా నిలిపేందుకు అందరం కృషి చేద్దామని పురపాలక మాజీ చైర్ పర్సన్ల వై.ఎస్. ప్రమీలమ్మ , రుక్మిణమ్మ పేర్కొన్నారు. శుక్రవారం స్వచ్ఛత ర్యాలీని వారు ప్రారంభించారు. కార్యక్రమంలో చైర్ పర్సన్ వరప్రసాద్, వైస్ చైర్మన్లు మనోహర్ రెడ్డి హాఫిజ్, కౌన్సిలర్లు, మున్సిపల్ కమిషనర్, వి. నరసింహారెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మురళీధర్, మున్సిపల్ సిబ్బంది, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థుల భాగస్వామ్యం అభినందనీయం

వేంపల్లె : సామాజిక సేవలో విద్యార్థులను భాగస్వాములు చేయడంలో ఎన్ఎస్ఎస్ పాత్ర కీలకమని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చెరసాల యోగాంజినేయులు అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు స్థానిక దళితవాడలోని ప్రాథమిక పాఠశాల వద్ద ఏడు రోజులుగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేసి ఆయా కార్యక్రమాలు చేపట్టారు. శనివారం ప్రత్యేక శిబిరం ముగింపు సందర్భంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేసి దళితవాడలోని పరిసరాలను శుభ్రంగా ఉంచేందుకు విద్యార్థులు కృషి చేశారని చెప్పారు. కాలనీలో మొక్కలు నాటడం సంతోషకరం అన్నారు. విద్యార్థులు భాగస్వామ్యం కావడంతో పలు సేవ కార్యక్రమాలు చేసేందుకు అవకాశం దక్కిందని చెప్పారు. ప్రజల ఆరోగ్య విషయాలను తెలుసుకోవడంతో పాటు మందులు కూడ పంపిణీ చేశారన్నారు. ప్రజలు కూడా పరిసరాలను శుభ్రంగా ఉంచుకొని ఆరోగ్యంగా ఉండాలని కోరారు. అనంతరం పాఠశాల కమిటీ ఛైర్మన్ మిస్టేక్ మాట్లాడుతూ ప్రభుత్వ డిగ్రీ విద్యార్థులు క్రమ శిక్షణతో ప్రత్యేక క్యాంప్‌కు హజరై ఆయా ప్రాంతాల్లో పనులు చేపట్టడం సంతోషకరం అన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలతో ప్రజల్లో చైతన్యం వచ్చే విధంగా కార్యక్రమాలు చేశారని తెలిపారు. దళితవాడ ప్రజల తరపున డిగ్రీ కళాశాల అధ్యాపకులకు, ఎన్ఎస్ఎస్ యూనిట్ అధికారులకు, విద్యార్థులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ నాగేంద్ర, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఓబుల్ రెడ్డి, పాఠశాల హెచ్‌ఎం గోవిందు, అధ్యాపకులు వినోద్, **ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) :** రాణి తిరుమల దేవి డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ 1 ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్పెషల్ క్యాంప్ శుక్రవారం మీనాపురం గ్రామంలో ముగిసింది. నేషనల్ యూత్ సర్వీస్ ఎన్ఎస్-ఎస్ ఎఒ వెంకటేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో 32 ప్రశ్నలతో కూడిన ఫార్మేట్‌ను గ్రామస్తులు ప్రజల నుంచి సేకరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ టి.చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ జాతీయ సేవా పథకం స్పెషల్ క్యాంపులో భాగంగా ఏడురోజులు వివిధ సేవా కార్యక్రమాల్లో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు చాలా చక్కగా తమకు అప్పగించిన బాధ్యతలను నిర్వహించారని చెప్పారు. వైవి యూనివర్సిటీ ఇచ్చిన సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. కార్యక్రమంలో గ్రామ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు, కళాశాల అధ్యాపక-అధ్యాపకేతర బృందం పాల్గొన్నారు.

కమలాపురం గౌస్‌ను పరామర్శించిన నాయకులు

ఖాజీపేట :టిడిపి జిల్లా మైనారిటీ సంయుక్త కార్యదర్శి కమలాపురం గౌస్ గుండెపోటుకు గురై ఆసుపత్రిలో చికిత్స పొంది శుక్రవారం నివాసానికి చేరుకున్నారు. శుక్రవారం మైదుకూరు నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ పుట్టా సధాకర్ యాదవ్, టిడిపి మండల కన్వీనర్ తిప్పిరెడ్డి లక్ష్మిరెడ్డి, నాయకులు మునీర్, సందుల నాగ శివారెడ్డి, జలీల్ అహ్మద్, జెండాల మహబూబ్ బాషా ఆయన్ను పరామర్శించారు. ఆరోగ్యం పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

ఓపెన్ ఇంటర్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

ప్రజాశక్తి- జమ్మలమడుగు రూరల్

ఏప్రిల్ 3 నుంచి రాష్ట్ర ప్రభుత్వం ఓపెన్ ఇంటర్ పరీక్షలు అధికారులు పకడ్బందీగా నిర్వహించాలని డివైఎఫ్ఐ పట్టణ అధ్యక్షులు ఎల్లయ్య, ఉపాధ్యక్షులు కాటిగాల్ల ప్రసాద్ తెలిపారు. శుక్రవారం స్థానిక ఎన్‌జిఒ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఏప్రిల్ 3 నుండి రాష్ట్ర వ్యాప్తంగా ఓపెన్ ఇంటర్ పరీక్షలు నిర్వహించనుందని, ఇప్పటికే షెడ్యూల్ కూడా విడుదల చేసిందని తెలిపారు. కానీ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ యాజమాన్యాలు విద్యార్థుల వద్ద నుంచి ఇప్పటికే వేలకు వేలు డబ్బులు వసూలు చేశాయని తెలిపారు. వివిధ రకాల మార్గాలలో కూడా విద్యార్థుల చేత పరీక్షలు రాయించడానికి సిద్దం చేస్తున్నారని తెలిసిందన్నారు. అధికారులు పటిష్టంగా పరీక్షలు నిర్వహించాలని కోరుతున్నామన్నారు. ఈ విషయంపై జిల్లా విద్యా శాఖ అధికారి, కలెక్టర్ వారి దృష్టికి కూడా తీసుకెళ్తామన్నారు.

బహు బాగు..కూరగాయల సాగు



చాపాడు వద్ద సాగు చేసిన బెండ పంట

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని కుందూ, కెసి కాలువ, బోరు బావుల నీటి ఆధారంతో వేసవి సీజన్‌లో సాగుచేసిన బెండ, కాకర, చిక్కుడు పంట వలన లాభాలు వస్తున్నాయని రైతులు పేర్కొంటున్నారు. సీతారామపురం, చాపాడు, జడ్డీ గారి కొట్టాలు గ్రామాల పరిధిలో భీర, వంకాయ, కాకర, బెండ వంటి పంటలను రైతులు అధికంగా సాగు చేపట్టారు. ఎకరాకు కోతకు రెండు టన్నుల వరకు దిగుబడి వస్తుందని, మూడు నాలుగు రోజులకు ఒకసారి దిగుబడి వస్తుందని పేర్కొంటున్నారు. కిలో రూ.20 నుంచి 25 ప్రకారం హైదరాబాదు, నెల్లూరు, తిరుపతి వంటి ప్రాంతాలకు ఎగుమతులు చేస్తున్నారు. వ్యాపారులే పంటపొలాల వద్దకు వచ్చి కొనుగోలు చేసి తీసుకెళ్తున్నారు. రైతులే పంటను తరలిస్తే రూ. 2 అదనంగా చెల్లించాలి. కూరగాయల ఎకర సాగుకు రూ. 50 వేల వరకు ఖర్చులు అవుతున్నాయని అని రైతులు పేర్కొంటున్నారు. పది రోజులుగా ఎండ దెబ్బకు పంట ఎండుతుందని రైతులు పేర్కొంటున్నారు. కర్రల పైనం బీర, కాకర సాగు చేపట్టడం వల్ల కాయలు పొడవుగా ఏర్పడి మంచి దిగుబడి వస్తుందని రైతులు పేర్కొంటున్నారు. సీతారామాపురం గ్రామ పరిధిలో 40 ఎకరాలు, మండల పరిధిలో వివిధ గ్రామాల్లో 40 ఎకరాల్లో కూరగాయల పంటలు సాగు చేపట్టారు. అట్టపెట్టెలలో బీరకాయ, కాకర, వంకాయలను పేర్చి ఇతర ప్రాంతాలకు రవాణా చేస్తున్నారు. వరి, పసుపు వంటి పంటల స్థానంలో కూరగాయలు సాగు చేపట్టడం వల్ల మంచి ఫలితాలు వస్తున్నాయని రైతులు పేర్కొంటున్నారు.

మహిళా అభ్యున్నతికి పెద్దపీట : ఎంపీ

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

మహిళల అభ్యున్నతికి వైసిపి ప్రభుత్వం పెద్దపీట వేసిందని కడప పార్లమెంటు సభ్యులు వైయస్ అవినాష్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మెప్మా ఆధ్వర్యంలో వి.జె. ఫంక్షన్ హాల్‌లో నియోజకవర్గ వ్యాప్తంగా డ్వాక్రా మహిళలకు మూడో విడత ఆసరా సంబంధించిన సమావేశం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీ మీట్లాడుతూ పాదయాత్రలో చెప్పిన ప్రకారం డ్వాక్రా అక్కచెల్లెమ్మెలకు అండగా ఉన్నారన్నారు. ముఖ్యమంత్రి చేస్తున్న అభివృద్ధి పనులు చూడలేక ప్రతిఏక్ష నాయకులు లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని వాపోయారు. రాష్ట్రంలో మహిళలను వ్యాపార వేత్తలుగామహిళలను తీర్చిదిద్దాల అనే లక్ష్యంతో వైఎస్ఆర్ ఆసరా పథకాన్ని ఏర్పాటు చేశారన్నారు. నూటికి నూరు శాతం మహిళా పక్షపాతిగా జగనన్న ప్రభుత్వం పని చేస్తుందన్నారు. మెడికల్ కళాశాల పులివెందులలో నిర్మించడమే లక్ష్యంగా కళాశాల పనులను ప్రారంభించారని చెప్పారు. 2024 నాటికి మెడికల్ కళాశాల పనులు పూర్తి చేసి ముఖ్యమంత్రిచే ప్రారంభిస్తారని తెలిపారు. నూతన ఆర్టీసీ బస్టాండ్, సిటీ సెంటర్ పులివెందులను సుందరీకరణగా తీర్చిదిద్దేందుకు ఎంతో కృషి చేస్తున్నారన్నారు. పులివెందుల నుంచి హైదరాబాద్, విజయవాడ, బెంగళూరు ప్రాంతాలకు వెళ్లేందుకు నేషనల్ హైవే రోడ్డు టెండర్లు పిలిచారని చెప్పారు. ముద్దనూరు నుంచి పులివెందుల మీదుగా ముదిగుబ్బకు రైల్వే మార్గంకు సంబంధించి సర్వే పనులు జరుగుతున్నాయి అన్నారు. ఏపీ కార్లలో అగ్రికల్చర్ ఆర్టికల్చర్ వెటర్నరీ కళాశాలలో ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నామని చెప్పారు.అంతకుముందు రైతులకు సంబంధించి జలకళ కింద బోరు మోటార్స్ పంపుసెట్లు స్టార్టర్లను ప్రారంభించారు. మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్వీట్స్ స్టాళ్లను ఆయన పరిశీలించి డ్వాక్రా మహిళలు చేసిన తినుబండారాలను ఆయన రుచి చూసి చాలా అద్భుతంగా ఉన్నాయని కితాబిచ్చారు. అనంతరం వైఎస్ఆర్ మూడో విడత ఆసరా మెగా చెక్కును అందజేశారు. కార్యక్రమంలో పాడా ఒఎస్‌డి అనిల్ కుమార్ రెడ్డి, మున్సిపల్ వైసిపి ఇన్‌ఛార్జి వైఎస్ మనోహర్ రెడ్డి, తొండూరు వైసిపి ఇన్‌ఛార్జి వై.ఎస్. మదన్ మోహన్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మార్కెట్ యార్డ్ చైర్మన్ చిన్నప్ప, రాష్ట్ర సివిల్ సప్లై డైరెక్టర్ గంగాధర్ రెడ్డి, వాల్మీకి సంఘ డైరెక్టర్ అంబకపల్లి నారాయణస్వామి, రాజుల భాస్కర్ రెడ్డి, కౌన్సిలర్ కిషోర్, వైసిపి నాయకులు పద్మనాభ రెడ్డి, వీరారెడ్డి, కడియాల లక్ష్మీనారాయణ, సర్వోత్తమ్ రెడ్డి, కార్యకర్తలు రైతులు ఉన్నారు.



మహిళలకు మెగా చెక్కును అందజేస్తున్న ఎంపీ అవినాష్‌రెడ్డి

ముద్దనూరు : జమ్మలమడుగు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి స్థానిక ఉన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం మాజీ ఎంపిపి మునిరాజారెడ్డితో కలిసి మండలంలోని 574 డ్వాక్రా సంఘాలకు మూడవ విడతగా మంజూరైన రూ. 6,39,24,134 కోట్ల చెక్కును మహిళలకు ఆసరా చెక్కును అందజేశారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్ పర్సన్ ఉమాదేవి, నాయీ బ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షులు గుర్రప్ప, మండల కన్వీనర్ శ్రీధర్ రెడ్డి, ఎంపిపి - 1 రేణుక, ఉప మండల అధ్యక్షులు పుష్పలత, యూత్ అధ్యక్షులు సుమంత్ యాదవ్, సర్పంచ్ అరుణమ్మ, ఉప సర్పంచ్ వీరాంజనేయ రెడ్డి, ఎంపిడిఒ రమణారెడ్డి, వెలుగు ఏరియా కో - ఆర్డినేటర్ ధనుంజయ, స్త్రీ నిధి మేనేజర్ జితేంద్ర, వెలుగు ఎపిఎం ఇబ్రహీం, కార్యదర్శి లక్ష్మి నరసింహులు, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

ఖాజీపేట : మైదుకూరు ఎమ్మెల్యే ఎస్. రఘురామిరెడ్డి ఆంజనేయ కొట్టలు గ్రామ సమీపంలో జివి ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన వైఎస్ఆర్ ఆసరా పథకానికి సంబంధించి డ్వాక్రా సంఘాలకు మంజూరైన రూ.8.30 కోట్ల మెగా చెక్కును మహిళలకు అందజేశారు. కార్యక్రమంలో ఎపిఐఐసి రాష్ట్ర డైరెక్టర్ గంగాధర్ రెడ్డి, జడ్పి కో-ఆప్షన్ సభ్యులు అచ్చుకట్ల కరీముల్లా, వైసిపి నాయకులు బుడ్డాయి పల్లె మాబాష, సహకార సంఘం రాఘవరెడ్డి, మండల పరిషత్ కో - ఆప్షన్స్ సభ్యులు మున్వర్ హుస్సేన్, మండల కన్వీనర్ మురళీమోహన్ రెడ్డి, పెద్ద రెడ్డి, కొత్తపేట గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

మెగా డిఎస్‌సిని విడుదల చేయాలి : డివైఎఫ్ఐ



సమావేశంలో మాట్లాడుతున్న డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్

ప్రజాశక్తి - బద్వేలు

తాము అధికారంలోకి వస్తే యేటా డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేస్తామని చెప్పిన వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి నాలుగేళ్ల నుంచి ఒక డిఎస్‌సి కూడా ఇవ్వకుండా మోసం చేశారని, వెంటనే మెగా డిఎస్‌సిని డివైఎఫ్ఐ జిల్ల కార్యదర్శి వీరనాల శివకుమార్ నిర్వహించాలని డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక సుందరయ్య భవన్‌లో డివైఎఫ్ఐ జిల్లా కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షులు చిన్ని అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులు మెగా డిఎస్‌సిని విడుదల చేయాలని ఏప్రిల్ 3న అన్ని డిఇఒ కార్యాలయాల వద్ద నిరసన నిర్వహిస్తామన్నారు. రాష్ట్రంలో టిటిసి, బిఇడి చేసిన అభ్యర్థులు దాదాపు 10 లక్షల మంది డిఎస్‌సి నోటిఫికేషన్ కోసం ఎదురుచూస్తున్నారని, రాష్ట్ర ప్రభుత్వం మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని వాపోయారు. యువతకు ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలు మరిచి నిరుద్యోగులను నట్టెట్లో ముంచి వారి ఆత్మహత్యలకు కారణమవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. 2019 నుంచి ఇప్పటిదాకా టీచర్ల భర్తీకై డిఎస్‌సి ప్రకటన రాకపోవడం సిగ్గు చేటని పేర్కొన్నారు. రాష్ట్రంలో దాదాపు 25 వేల పోస్టులకు పైగా ఉపాధ్యాయ ఖాళీలుంటే మన విద్యాశాఖ మంత్రి మాత్రం నోటికి వచ్చిన లెక్కలు చెబుతున్నారని కనీస అవగాహనా లేకుండా మాట్లాడుతున్నారని విమర్శించారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలే పరమావధిగా పరిపాలన చేస్తున్నారే తప్ప, ప్రభుత్వ శాఖలో ఖాళీ పోస్టులను భర్తీని పూర్తిగా మరిచిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం బుద్ధి తెచ్చుకొని పాదయాత్ర సమయంలో యువతకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు డేవిడ్ రాజ్, రెబ్బా నరసింహులు, జిల్లా కమిటీ సభ్యులు డి.ఎం. ఓబులేసు, కటిగాల్ల ప్రసాద్, నాయకులు ఇమ్మనియేలు, నాగార్జున, షరీఫ్, రమణారెడ్డి, మళ్లీ నిరుద్యోగ అభ్యర్థులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న అకౌంట్ సెక్షన్ సిబ్బంది

పనివేళల మార్పుపై ఆర్‌టిపిపి సిబ్బంది ధర్నా

ఎర్రగుంట్ల: ఆర్‌టిపిపిలో ఉన్నతాధికారులు సిబ్బంది పని వేళల్లో మార్పు చేయడం పట్ల శుక్రవారం అకౌంట్ సెక్షన్ సిబ్బంది విధులు బహిష్కరించి కార్యాలయం గేటు ముందు ధర్నా చేశారు. ఈ సందర్భంగా సిబ్బంది మాట్లాడుతూ సాధారణంగా ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విధులు నిర్వహించాల్సి ఉందని చెప్పారు. ఆ సమయాన్ని అకౌంట్ సెక్షన్ ఉన్నతాధికారులు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటలకు మార్పు చేయడం ఏంటని ప్రశ్నించారు. ఎపిఎస్‌ఇబి అడ్మినిస్ట్రేటివ్ మాన్యువల్, డిస్ట్రిక్ట్ ఆఫీస్ మాన్యువల్ ప్రకారం ఉదయం 10.30 గంటలకు విధులు హాజరు కావాలన్నారు. ఉన్నతాధికారులు అందుబాటులో లేకపోవడంతో శనివారమూ ధర్నా నిర్వహిస్తామని వారు పేర్కొన్నారు.

వడదెబ్బపై అవగాహన

ప్రజాశక్తి-ప్రొద్దుటూరుటౌన్

స్థానిక స్త్రీ శక్తిభవన్‌లో జెవివి ఆధ్వర్యంలో వేసవిలో తీసు కోవాల్సిన జాగ్రత్తలు, వడదెబ్బపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జెవివి రాష్ట్ర కార్యదర్శి తవ్వా సురేష్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వేసవిలో కూల్‌డ్రింక్స్ తాగ కుండా సహజ పానీ య లైన టెంకాయనీళ్లు, పండ్ల రసాలు తాగాలన్నారు. కూల్‌డ్రింక్స్‌లో విషపూరిత రసా యనా లుంటాయన్నారు. అవ సరమైతే తప్ప ఎవరూ ఎండకు బయటకు రాకూ డదని తెలిపారు. కార్యక్ర మంలో మెప్మా అధి కారి, జెవివి ఉపాధ్యక్షులు హేమ లత, ఇందిరా, మహిళలు పాల్గొన్నారు.

కూరగాయల మార్కెట్ టెండర్ వాయిదా

పులివెందుల రూరల్ : దినసరి, వారపు కూరగాయల మార్కెట్ టెండర్ మళ్లీ వాయిదా పడినట్లు కమిషనర్ వి.వి. నరసింహారెడ్డి తెలిపారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో కూరగాయల మార్కెట్‌కు సంబంధించి టెండర్‌లో రూ. 52. 30 లక్షల సర్కార్ వారి పాట పాడగా గుత్తేదారులు పాట పాడేందుకు ఎవరూ ముందుకు రాలేదు. దీంతో టెండర్‌ను సోమవారానికి వాయిదా వేస్తున్నట్లు కమిషనర్ తెలిపారు.

చీనీకాయల మండీలు ప్రారంభం

పులివెందుల రూరల్ : స్థానిక ముదునూరు రోడ్డులోని మార్కెట్ యార్డులో నూతనంగా నిర్మించిన చీనీ కాయల 10 మండీలను శుక్రవారం ఎంపీ అవినాష్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతన్నలకు ఎంత మంచి చేయాలో సీఎం అంత చేస్తున్నారని, అందులో భాగంగానే పులివెందులలో రైతుల వద్ద నుండి చీని కాయలు కొనుగోలు చేసేందుకు మార్కెట్ యార్డ్‌లో రూములను రూ. 26 లక్షల వ్యయంతో నిర్మించారన్నారు.

అలిరెడ్డిపల్లె సర్పంచ్, ఉప సర్పంచ్ రాజీనామా

ప్రజాశక్తి - వేంపల్లె



ఎంపిడిఒకు రాజీనామా పత్రాన్ని అందజేస్తున్న సర్పంచ్

మండలంలోని అలిరెడ్డిపల్లె పంచాయతీ సర్పంచ్ నాగరాజు, ఉప సర్పంచ్ లోమడ అంజనమ్మ తమ పదవులకు రాజీనామా చేశారు. గతంలో ఇరు పార్టీలు కూదుర్చుకున్న ఒప్పందం ప్రకారం వారు ఇరువురూ రాజీనామా చేశారు. ఈ మేరకు శుక్రవారం ఎంపిడిఒ మల్లికార్జునరెడ్డికి తమ రాజీనామా పత్రాన్ని అందజేశారు. 2021 ఫిబ్రవరి 16న నిర్వహించిన స్థానిక సంస్థల ఎన్నికల్లో అలిరెడ్డిపల్లె పంచాయతీలో టిడిపి, వైసిపి నాయకులు ఏకమై ఒక అవగాహన ప్రకారం సర్పంచ్ వైసిపి, ఉపసర్పంచ్ టిడిపి వారు పదవులను పంచుకున్నారు. ఒప్పందం ప్రకారం పదవి కాలం పూర్తి కావడంతో రాజకీయ పెద్దల నిర్ణయం మేరకు సర్పంచ్ నాగరాజు, ఉప సర్పంచ్ అంజనమ్మ తమ పదవులకు స్వచ్ఛంధంగా రాజీమా చేశారు. రాజీనామా పత్రాల్లో మాత్రం వ్యక్తిగత, ఆరోగ్య కారణాల వల్ల తాము రాజీనామా చేస్తున్నామని, ఇందులో ఎవరి ఒత్తిడి, ప్రమేయం లేదని పేర్కొన్నారు. కొత్త నిబంధనల మేరకు రాజీనామా పత్రాలను డిపిఒకు ఇవ్వాలని ఎంపిడిఒ సూచించారు. జిల్లా అధికారుల ఉత్తర్వులు మేరకు సర్పంచ్, ఉప సర్పంచి పదవులకు ఎన్నికలు నిర్వహిస్తామని చెప్పారు.

నేడు ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు

వేంపల్లె : స్థానిక వెలుగు కార్యాలయంలో శనివారం ఆదిత్య బిర్లా గార్మెంట్స్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు వెలుగు ఎపిఎం బాలస్వామి ఒక ప్రకటనలో తెలిపారు. ఆదిత్య బిర్లా గార్మెంట్స్‌లో టైలరింగ్ ఉద్యోగాలు పొందేందుకు మహిళలు మాత్రమే ఇంటర్వ్యూలకు హాజరు కావాలని కోరారు. ఇంటర్వ్యూకు హాజరయ్యే మహిళా అభ్యర్థులు ఆధార్ కార్డు, పాస్ పోర్టు సైజ్ ఫొటో, స్టడీ, టైలరింగ్‌లో అనుభవం ఉన్న సర్టిఫికెట్లు వెంట తెచ్చుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 9000404816, 8374491240 సంప్రదించాలని కోరారు. అవకాశాన్ని టైలరింగ్ లో శిక్షణ పొందిన ప్రతి మహిళా సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆశా కార్యకర్తకు సన్మానం

ఖాజీపేట : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రెండో సచివాలయ పరిధిలోని సుంకేసుల ఆశా కార్యకర్త కె. లక్ష్మిదేవి శుక్రవారం ఉద్యోగ విరమణ సందర్భంగా సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఎస్. ముబీన్, ఆశా నోడల్ అధికారి అరుణకుమారి ఆధ్వర్యంలో సూపర్‌వైజర్లు, ఎంఎల్‌హెచ్‌పిలు ఆశా కార్యకర్తలను పూలమాలలతో ఘనంగా సన్మానించారు. మండల ఆరోగ్య విస్తరణ అధికారులు మాచనూరు రాఘవయ్య, బి.నాగభూషణం కార్యకర్త లక్ష్మీదేవమ్మ అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సునీల్ కుమార్, కృష్ణ ప్రియ, సిహెచ్‌ఒలు, ఎఎన్ఎంలు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.



విద్యాసామగ్రిని అందజేస్తున్న ఎస్ఐ నాగమురళి, హెచ్‌ఎం కవిత

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ


ప్రజాశక్తి-కలసపాడు

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో చెరుకూరు రవికుమార్ సహకారంతో స్థానిక జడ్పి బాలికల హైస్కూల్‌లో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు శుక్రవారం పరిక్ష సామగ్రిని అందజేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎస్ఐ నాగమురళి చేతుల మీదుగా విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఎస్ఎఫ్ఐ విద్యా రంగ సమస్యలపై పోరాడడమేగాక విద్యార్థుల విద్యాభివృద్ధికి పాటుపడడం అభినందనీయమన్నారు. పోరుమామిళ్ల, కలసపాడు, బి. కోడూరు, కాశినాయన మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు పరీక్ష సామగ్రిని చెరుకూరి రవికుమార్ అందించేందుకు ముందుకు రావడం శుభ పరిణామమన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సగిలి రాజేంద్రప్రసాద్, జిల్లా సహాయ కార్యదర్శి వీరపోగు రవి మాట్లాడుతూ విద్యార్థులు పోరాడుతూ చదువుకోవాలన్నారు. పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ మార్కులు తెచ్చుకోవాలని ఆకాక్షించారు. దాత చెరుకూరు రవికి ఈ సందర్భంగా వారు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో బాలికల హైస్కూల్ హెచ్‌ఎం కవిత, ఎస్ఎఫ్ఐ నాయకులు ప్రశాంత్, షాహిద్, సుమంత్, బబ్లు పాల్గొన్నారు.

ఎంఆర్ మొబైల్ దుకాణం ప్రారంభం

ప్రజాశక్తి పులివెందుల రూరల్

పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలో నూతనంగా ఏర్పాటుచేసిన ఎం ఆర్ మొబైల్ దుకాణాన్ని శుక్రవారం వైసిపి నాయకులు దంతలూరు కృష్ణ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారులకు నాణ్యమైన మొబైల్స్‌ను విక్రయించాలని సూచించారు. అనంతరం నూతన మొబైల్స్‌ను ఆయన పరిశీలించారు. ఆయన్ను దుకాణ యజమాని దృశ్యాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో పులివెందుల పురపాలక పుర చైర్మన్ డాక్టర్ వల్లపు వరప్రసాద్, వైస్ చైర్మన్ హఫీజ్, కౌన్సిలర్ ఖాదర్‌బాషా, షాపు యజమాని యషీర్, బాబా ఉన్నారు.



మొబైల్ షాపు ప్రారంభోత్సవంలో వైసిపి నాయకులు దంతలూరు కృష్ణ